క్లుప్తంగా

నకిలీ ఎరువులు విక్రయిస్తే చర్యలు



ఎరువుల షాపులో తనిఖీ చేస్తున్న జవహర్ నాయక్

పుల్లలచెరువు: మండలంలోని ఎరువుల దుకాణదారులు నకిలీ ఎరువులు, పురుగుమందులు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని క్వాలిటీ కంట్రోల్ అధికారి జవహర్‌నాయక్ హెచ్చరించారు. మండల కేంద్రంలోని పలు ఎరువుల దుకాణాలను ఆయన శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా షాపుల్లో ఎరువులు, పురుగుమందులను పరిశీలించడంతో పాటు స్టాక్ రిజిస్టర్లు, రసీదు పుస్తకాలు, ఓపీ ఫారాలు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జవహర్‌నాయక్ మాట్లాడుతూ రైతులకు నాణ్యమైన సేవలు అందజేయాలన్నారు. ప్రతి దుకాణదారుడు ప్రభుత్వంతో అనుమతి పొందిన ఎరువులు, పురుగుమందులను మాత్రమే విక్రయించాలని చెప్పారు. ప్రతి షాపులో ధరల పట్టికలను ఏర్పాటు చేయాలని, రైతులు కొనుగోలు చేసినప్పుడు తప్పని సరిగా రసీదులు అందజేయాలని పేర్కొన్నారు. రైతుల నుంచి ఫిర్యాదులు వస్తే విచారణ చేసి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

జీతాల కోసం కార్మికుల ఆందోళన



ఆందోళన చేస్తున్న పంచాయతీ కార్మికులు

పెద్దదోర్నాల: మేజర్ గ్రామ పంచాయతీలో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్టు కార్మికులు, స్వచ్ఛ భారత్ కార్మికులకు కొద్ది నెలలుగా జీతాలు అందక పోవడంతో ఆర్థాకలితో అలమటిస్తున్నారని, వారికి వెంటనే జీతాలు చెల్లించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో శుక్రవారం కార్మికులు ఆందోళన చేపట్టారు. జీతాలు వెంటనే చెల్లించాలని కార్మికులు కార్యాలయం ఎదుట నినాదాలు చేశారు. కార్యక్రమంలో నాయకులు పానుగంటి పిచ్చయ్య, కార్మికులు అచ్చయ్య, దేవమ్మ, కాశయ్య, కిరణ్, పెద్దయేసు, అరుణ్, రైతు సంఘ నాయకులు సోమయ్య, దుగ్గెంపూడి తిరుపలిరెడ్డి, గంగిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

మండల స్థాయి స్కూల్ గేమ్స్‌పై పీడీల సమావేశం

మద్దిపాడు: మండల స్థాయిలో స్కూల్ గేమ్స్‌లో భాగంగా మండలంలోని పది ఉన్నత పాఠశాలల్లో ఆటల పోటీల నిర్వహణకు ఎంఈఓ ఎంవీఆర్ ఆంజనేయులు అధ్యక్షతన స్థానిక ఎంఆర్‌సీ కార్యాలయంలో పాఠశాలల పీడీలు శుక్రవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ క్రీడాకారులు అధిక సంఖ్యలో పాల్గొనే విధంగా చూడాలని, పండుగ వాతావరణంలో క్రీడలు నిర్వహించాలని సూచించారు. మండలంలోని గుండ్లాపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈ నెల 17, 18, 19 తేదీల్లో వివిధ క్రీడాంశాలలో పోటీలు జరుగుతాయని తెలిపారు. కార్యక్రమంలో మండల స్పోర్ట్స్ కో ఆర్డినేటర్ టి.విజయ్‌కుమార్ (బాబి), పాఠశాలల ఫిజికల్ డైరెక్టర్లు పాల్గొన్నారు.

ముండ్లమూరులో ప్రొటోకాల్ ఉల్లంఘన

- టీడీపీ నేతలా వ్యవహరిస్తున్న వ్యవసాయాధికారులు
- అధికారిక కార్యక్రమాలపై ఆఫీసర్ల ఇష్టారాజ్యం
- ఎంపీపీ, జెడ్పీటీసీలకు అందని ఆహ్వానాలు



వేదిక వెనుక ఉన్న మధ్య ఫ్లెక్సీలో కలెక్టర్ చిత్రంపై టీడీపీ ఇన్‌చార్జి గొట్టిపాటి లక్ష్మి ఫొటో

ముండ్లమూరు (దర్శి): దర్శి నియోజకవర్గంలో అధికారుల తీరు రోజురోజుకూ వివాదాస్పదంగా మారుతోంది. ప్రభుత్వ కార్యక్రమాలకు కలెక్టర్ వస్తున్నా ప్రొటోకాల్ పాటించడం లేదు. ప్రొటోకాల్ ప్రకారం పిలవాల్సిన ఎంపీపీ, జెడ్పీటీసీలను ఆహ్వానించడం లేదు. స్థానిక అధికార పార్టీ నేతలు, అధికారుల తీరుపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సామాన్య ప్రజలు సైతం ముక్కున వేలేసుకుంటున్నారు. గ్రామాల్లో గ్రామసభలు పెట్టినా ప్రొటోకాల్ లేకుండా ప్రభుత్వానికి సంబంధంలేని నేతలను తెచ్చి వేదికలపై కూర్చోబెడుతున్నారు. అధికారిక కార్యక్రమాలకు గెలిచిన వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డిని ఆహ్వానించకుండా ఆయన చేతిలో ఓడిన టీడీపీ ఇన్‌చార్జి గొట్టిపాటి లక్ష్మికి ప్రాధాన్యం ఇవ్వడాన్ని స్థానికులు జీర్ణించుకోలేక పోతున్నారు. ఆమె ఫొటోలతో ఫ్లెక్సీలు వేస్తూ హంగామా సృష్టిస్తున్నారు. వివరాలు.. ముండ్లమూరులో రసాయనిక ఎరువులు వాడకాన్ని తగ్గించాలని.. నానో ఎరువులు అలవాటు చేసుకోవాలని కోరుతూ (యూరియా ఔట్ రీచ్ ప్రోగ్రాం) జిల్లా అధికారులు ఈ నెల 10వ తేదీన మండల కేంద్రం ముండ్లమూరులో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి కలెక్టర్ తమీమ్ అన్సారియా ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జిల్లా వ్యవసాయాధికారితో పాటు శాస్త్రవేత్తలు హాజరయ్యారు. పూర్తి ప్రభుత్వ కార్యక్రమం అయినా కలెక్టర్ కుర్చీ వెనుక కార్యక్రమానికి సంబంధించిన ఫ్లెక్సీలు వేసి అందులో కలెక్టర్ ఫొటోతో పాటు టీడీపీ ఇన్‌చార్జి గొట్టిపాటి లక్ష్మి ఫొటోను ముద్రించారు. దీనికి తోడు వైఎస్సార్ సీపీ తరఫున ఎంపీపీ అయిన సుంకర సునీతను, జెడ్పీటీసీ తాతపూడి రత్నరాజును కార్యక్రమానికి ఆహ్వానించలేదు. అధికారిక కార్యక్రమాలను టీడీపీ కార్యక్రమాలుగా నిర్వహిస్తున్న వ్యవసాయాధికారి వ్యవహార శైలిపై సామాన్య ప్రజలు, రైతులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు.

కలెక్టర్ వస్తున్నా ఎంపీపీని పిలవరా:



కలెక్టర్ వస్తున్నా వ్యవసాయాధికారులు ఎంపీపీ అయిన నాకు ఎటువంటి సమాచారం ఇవ్వలేదు. మండలంలోని ప్రజలంతా కలిసి ఎన్నుకున్న ప్రజా ప్రతినిధులను గౌరవించక పోతే ఎలా? మహిళా ఎంపీపీ అని చులకన భావమా లేక వైఎస్సార్ సీపీ ఎంపీపీ అని పక్కన పెడుతున్నారో అర్థం కావడం లేదు. దీనికి అధికారులే సమాధానం చెప్పాలి. ఇది మంచి పద్ధతి కాదు. కలెక్టర్ కూడా ఇటువంటి విషయాలపై దృష్టి సారించాలి.

– ఎంపీపీ సుంకర సునీత

నన్ను ఎందుకు ఆహ్వానించ లేదు:



కలెక్టర్ ప్రోగ్రాంలో వైఎస్సార్ సీపీ ప్రజాప్రతినిధులు పాల్గొనకూడదా? లేక దళిత జెడ్పీటీసీ అని చులకన భావమా? వైఎస్సార్ సీపీ అధికారంలో లేకుంటే ప్రొటోకాల్ పాటించరా? ఇదేం పద్ధతి. అధికారులు కూడా రాజకీయ నాయకుల్లా ప్రవర్తించడం సరికాదు. ప్రభుత్వ కార్యక్రమాలకు ఇక్కడ గెలుపొందిన ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి ఫొటోలు పెట్టడం లేదు. ఓడిపోయిన టీడీపీ ఇన్‌చార్జి గొట్టిపాటి లక్ష్మి ఫొటోలు పెడుతున్నారు.

– తాతపూడి రత్నరాజు, జెడ్పీటీసీ

హక్కులతో పాటు బాధ్యతలూ పంచుకుంటాం..



విద్యార్థులకు ప్లేట్లు, గ్లాసులు పంపిణీ చేస్తున్న ఉపాధ్యాయులు

- యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ హై

దర్శి: యూటీఎఫ్ ఆధ్వర్యంలో హక్కులతో పాటు బాధ్యతలను కూడా పంచుకుని సహాయ సహకారాలు అందించడమే లక్ష్యంగా పని చేస్తామని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఓ.అబ్దుల్ హై సూచించారు. మండలంలోని చిన్న ఉయ్యాలవాడ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నారాయణ అధ్యక్షతన శుక్రవారం సమావేశమయ్యారు. సమావేశానికి మండల విద్యాశాఖాధికారులు కాకర్ల రఘురామయ్య, రమాదేవిలు ముఖ్య అతిథులుగా జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ హై, జిల్లా కార్యదర్శులు టి.రాజశేఖర్, మీనిగ శ్రీను గౌరవ అతిథులుగా హాజరయ్యారు. చిన్న ఉయ్యాలవాడకు చెందిన ఎస్ఎంసీ చైర్మన్ నారాయణ 30 మంది విద్యార్థులకు ప్లేట్లు, గ్లాసులు పంపిణీ చేశారు. గ్రామస్తులు అయ్యప్ప విద్యార్థులకు ఐడీ కార్డులు పంపిణీ చేశారు. అబ్దుల్ హై మాట్లాడుతూ యూటీఎఫ్ కార్యకర్తలు ఎప్పుడూ హక్కుల కోసం మాత్రమే కాకుండా బాధ్యతలను కూడా పంచుకుంటామనేందుకు నిదర్శనంగా నారాయణ పని చేస్తున్నారని కొనియాడారు. తాను పాఠశాలకు వచ్చిన మూడు నెలల్లోనే గ్రామస్తులతో మమేకమై ఈ కార్యక్రమం నిర్వహించడం శుభపరిణామమని చెప్పారు. ఇదే చొరవతో గ్రామస్తులు సహకారంతో ముందుకెళ్లాలని సూచించారు. గ్రామస్తులు అయ్యప్ప తదితరులు మాట్లాడుతూ పాఠశాల మండలానికి సుదూరంగా ఉందని, పాఠశాలకు అవసరమైన మౌలిక వసతులు కల్పిస్తే గ్రామానికి చెందిన విద్యార్థులందరినీ ఈ పాఠశాలకు పంపిస్తామని కోరారు. ఎంఈఓలు రఘురామయ్య, రమాదేవి మాట్లాడుతూ మండలంలో ఏ నిధులు వచ్చినా మొదట ఈ పాఠశాలకు కేటాయిస్తామని, గ్రామస్తులంతా కలిసికట్టుగా పాఠశాలను అభివృద్ధి చేసుకుని పిల్లలను బాగా చదివించుకోవాలని విజ్ఞప్తి చేశారు. దర్శి మండల అధ్యక్షుడు శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి పి.ఖాసిం, ముండ్లమూరు అధ్యక్షుడు తిరుపతిరెడ్డి, ప్రధానోపాధ్యాయురాలు భారతి, రాజంపల్లి ప్రధానోపాధ్యాయుడు వెన్నెల శ్రీనివాసరావు, యూటీఎఫ్ కార్యకర్తలు ఏడుకొండలు, కృష్ణ, సుబ్బారావు, కిషోర్, షానులాషా, రాంబాబు, రాజ పాల్గొన్నారు.

భవిష్యత్ పోరాటాలకు సిద్ధం కావాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఉపాధ్యాయులు

కురిచేడు: ఉపాధ్యాయుల పరిస్థితి మరింత ఘోరంగా పరిణమిస్తోందని ఏపీటీఎఫ్ మండల శాఖ ప్రధాన కార్యదర్శులు ఆసుల వెంకటస్వామి, షేక్ ఖాజారహంతుల్లా ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు వారు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఉపాధ్యాయుల సమస్యలపై తమ నిరసనలను వారం రోజులపాటు ప్రభుత్వానికి తెలియజేయనున్నట్లు తహసీల్దార్ రజనీకుమారికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎలా పాఠం చెప్పాలో, ఏం చెప్పాలో అన్నింటినీ ఉన్నతాధికారులే నిర్ణయిస్తారని, పరీక్షలు, ప్రశ్నపత్రాలు అశాస్త్రీయమైన రీతిలో ముద్రించి పంపుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. సిలబస్‌లో లేని ప్రశ్నలు ఇటీవల కాలంలో అధికంగా వెలుగుచూడటం అందుకు నిదర్శనమన్నారు. ఇటీవల కాలంలో మూల్యాంకనం కోసం అసెస్‌మెంట్ పుస్తకాల విధానం తీవ్ర గందరగోళానికి దారితీస్తోందన్నారు. పాఠశాల పనివేళలో మూల్యాంకనం చేయాల్సిన అగత్యం ఏర్పడిందని, బోధనా గంటలు తగ్గిపోతూ సిలబస్ అధికంగా పేరుకుపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. బోధనేతర పనులు వివిధ రకాల యాప్‌ల ద్వారా ఉపాధ్యాయులను వెంటాడుతూ వేధిస్తున్నట్లు పేర్కొన్నారు. వీటన్నింటి నుంచి ఉపాధ్యాయులకు విముక్తి లభించాలంటే పోరాటమే మార్గమని పేర్కొన్నారు. నిరసన వారంగా షెడ్యూల్ వేసి మరి నిరసన చేస్తున్నట్లు తెలిపారు. 11వ తేదీ నల్ల బ్యాడ్జిలతో నిరసన తెలుపుతూ విధులకు హాజరు, 12వ తేదీ మండల కేంద్రాల్లో నిరసన ప్రదర్శన, 13,14వ తేదీలు ప్రజాప్రతినిధులకు వినతిపత్రాలు, 15వ తేదీ పాత తాలూకా కేంద్రాల్లో నిరసన ప్రదర్శన, 16న జిల్లా కేంద్రంలో నిరసన ప్రదర్శన, 17వ తేదీన సీఎం, సీఎస్‌లకు వాట్సప్, ఈ మెయిల్ ద్వారా వినతులు ఇవ్వనున్నట్లు వివరించారు. కురిచేడు మండల శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆసుల వెంకటస్వామి, షేక్ ఖాజారహంతుల్లా, జిల్లా కార్యదర్శి సీఎస్ శివరామకృష్ణ, షేక్ మస్తాన్వలి, కె.మహితేజ, షేక్ నసీమా, అశ్విని, టి.స్వరూప, కె.నర్మద, వి.స్వాతి పాల్గొన్నారు

జెడ్పీటీసీకి ఎమ్మెల్యే తాటిపర్తి పరామర్శ



జాన్‌పాల్‌ను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే తాటిపర్తి

త్రిపురాంతకం: రోడ్డు ప్రమాదంలో ఇటీవల గాయపడి విశ్రాంతి తీసుకుంటున్న జెడ్పీటీసీ మాకం జాన్‌పాల్‌ను యర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ శుక్రవారం పరామర్శించారు. జాన్‌పాల్‌ను ఒంగోలులోని ఆయన స్వగృహంలో కలిసిన ఎమ్మెల్యే.. ఆయన ఆరోగ్య పరిస్థితిపై ఆరాతీశారు. ఎమ్మెల్యేతో పాటు మండల పార్టీ కన్వీనర్ ఎస్.పోలిరెడ్డి, సుబ్రహ్మణ్యం, నారాయణరెడ్డి, పెద్దారవీడు జెడ్పీటీసీ ఏరువ చలమారెడ్డి, కోటిరెడ్డి ఉన్నారు.

పాఠశాలలో వైద్య శిబిరం



సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పిస్తున్న వైద్యులు

దర్శి: నగర పంచాయతీ పరిధి శివరాజ్ నగర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో మానవత ఆధ్వర్యంలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు సీజనల్ వ్యాధులపై శుక్రవారం అవగాహన కల్పించారు. విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి జ్వరం, జలుబు, దగ్గు ఉన్న వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అర్బన్ పీహెచ్‌సీ వైద్యాధికారి కాశీ చేతన్ ఆధ్వర్యంలో వైద్య ఆరోగ్యశాఖ సిబ్బందితో మెడికల్ క్యాంపు నిర్వహించారు. మెడికల్ క్యాంపులో ప్రైవేటు వైద్య శాలల్లోని ప్రముఖ వైద్యులు బాదం వెంకట హర్షవర్ధన్‌రెడ్డి, మేడికొండ మల్లారెడ్డి, సాయిమణింధర్‌రెడ్డిలు ఉచిత సేవలందించారు. మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ప్రధాన కార్యదర్శి కపురం శ్రీనివాసరెడ్డి, చైర్మన్ దేవతి వరప్రసాదరావు, అధ్యక్షుడు చీదెళ్ల బసవయ్య, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ధనిరెడ్డి వెంకటరెడ్డి పాల్గొన్నారు.

గుంటి గంగ ఆలయ ఆదాయం రూ.6.82 లక్షలు



ప్రత్యేక అలంకరణలో గంగమ్మ తల్లి



గుడి ఆదాయన్ని లెక్కిస్తున్న సిబ్బంది, భక్తులు

తాళ్లూరు: జిల్లాలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రం గుంటి గంగా భవానీ అమ్మవారి ఆలయానికి సంబంధించి వివిధ రూపాల్లో భక్తుల నుంచి 150 రోజులకు వచ్చిన ఆదాయం సుమారు రూ.6.82 లక్షలని ఈవో గుంటపల్లి వాసు శుక్రవారం తెలిపారు. హుండీ ఆదాయాన్ని దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ అనంత సత్యనారాయణ పర్యవేక్షణలో భ్రమరాంబిక సేవా సమితి సభ్యులు లెక్కించారు. తొలుత అమ్మవారికి ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఈవో గుంటపల్లి వాసు, చైర్మన్ గురుబ్రహ్మం, ఆర్‌పి కె.ప్రసాద్‌రావు, పూజారి కామేశ్వర శర్మ, ఆలయ అర్చకులు మెట్టెల బాలరాజు, పి.విజయలక్ష్మి, ఆలయ బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

మనమిత్ర సర్వీస్‌కు వ్యతిరేకంగా నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న వార్డు సచివాలయాల సెక్రటరీలు

చీమకుర్తి: మన మిత్ర యాప్ ద్వారా క్లస్టర్ మ్యాపింగ్ సర్వీస్ విధానానికి వ్యతిరేకంగా చీమకుర్తి అర్బన్‌లోని సచివాలయాల సెక్రటరీలందరూ శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. చీమకుర్తి మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. వార్డు సచివాలయాల పరిధిలోని క్లస్టర్‌లను మ్యాపింగ్ చేసే సేవల నుంచి తమను మినహాయించాలని కోరుతూ రాష్ట్ర సచివాలయాల సంఘం పిలుపు మేరకు ఈ కార్యక్రమం నిర్వహించారు. అందులో భాగంగా సమ్మె చేయనున్నట్లు మున్సిపల్ మేనేజర్‌కు సమ్మె నోటీసు అందించారు.

దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరించాలి



జెడ్పీ సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీటీసీ నాగిరెడ్డి

కురిచేడు: మండలంలో దీర్ఘకాలికంగా ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని జెడ్పీటీసీ నుసుం వెంకట నాగిరెడ్డి కోరారు. శుక్రవారం ఒంగోలులో జరిగిన జిల్లా పరిషత్ సమావేశంలో సమస్యలను జెడ్పీటీసీ నుసుం వెంకట నాగిరెడ్డి లేవనెత్తారు. ప్రధానంగా గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న రోడ్లతో పాటు మండల కేంద్రానికి అనుసంధానమై ఉండే గ్రామీణ లింకు రోడ్లను తక్షణమే పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ముఖ్యంగా పడమర కాశీపురం నుంచి వెల్లంపల్లి వరకు, వెంగాయపాలెం నుంచి పడమర వీరాయిపాలెం వరకు రోడ్లను వెంటనే పూర్తి చేయాలని సమావేశంలో కోరారు. కురిచేడులో రహదారిపై ఉన్న విద్యుత్ స్తంభాలు వెంటనే తొలగించాలని కోరగా నిధులు విడుదల చేశామని, త్వరలో విద్యుత్ స్తంభాలు తొలగించనున్నట్లు అధికారులు తెలిపినట్లు నాగిరెడ్డి వివరించారు. మండలంలో యూరియా కొరత లేకుండా చూడాలని కోరారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మందుల కొరత ఉందని, వెంటనే పూర్తిగా మందులు పంపిణీ చేయాలని కోరారు. ఆస్పత్రిలో మరమ్మతులకు గురైన పరికరాలు వెంటనే బాగు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరినట్లు ఆయన తెలిపారు.

రణభేరి వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎంఈఓ, ఉపాధ్యాయులు

కురిచేడు: యూటీఎఫ్ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు రణభేరి వాల్‌పోస్టర్‌ను శుక్రవారం ఎంఈఓ ఆర్.వస్త్రాంనాయక్ కార్యాలయం ఆవరణలో ఆవిష్కరించారు. ఆర్థిక, విద్యా రంగ సమస్యల సాధనకు ఈ నెల 15 నుంచి 19 వరకు బైక్ జాత కార్యక్రమం నిర్వహించనున్నట్లు కురిచేడు శాఖ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాసరెడ్డి, శ్రీను తెలిపారు. అప్పటికి రాష్ట్ర ప్రభుత్వం స్పందించకుంటే యూటీఎఫ్ రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 25న విజయవాడలో రణభేరి కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. మండల శాఖ గౌరవ అధ్యక్షుడు షేక్ ఖాదర్ వలీ, అధ్యక్షుడు అన్నెం శ్రీనివాస్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి మైలవరం శ్రీను, కోశాధికారి కట్టా పూర్ణచంద్రరావు, అసోసియేటెడ్ అధ్యక్షుడు డి.జాన్‌బాబు పాల్గొన్నారు.

నల్ల బర్లీ పొగాకు సాగు వద్దు

కొండపి: మండలంలోని రైతులు నల్ల బర్లీ పొగాకు సాగుచేయవద్దని ఏడీఏ నిర్మలాకుమారి సూచించారు. శుక్రవారం మండలంలోని అనకర్లపూడి, ముప్పరాజుపాలెం గ్రామాల్లో నల్ల బర్లీ పొగాకు సాగుపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నల్ల బర్లీ పొగాకు సాగును నిషేధించిందన్నారు. జీవో నంబర్ ఆర్టీ 740 నియమ నిబంధనల ప్రకారం ప్రభుత్వం నల్ల బర్లీ పొగాకు నర్సరీలను కూడా నిషేధించిందని, రబీ సీజన్లో నల్ల బర్లీ పొగాకు సాగుచేయవద్దని తెలిపారు. రైతులు సాగు చేసినా ప్రభుత్వం కొనుగోలు చేయదని, దానివలన రైతులు తీవ్రంగా నష్టపోతారని తెలిపారు. అనంతరం పొగాకు నారుమడులను పరిశీలించారు. కార్యక్రమంలో ఏవో మాల్యాద్రి, ఏఈఓ కుమార్, వీఏఏ పవిత్ర, గ్రామ రైతులు పాల్గొన్నారు.

ఎటుచూసినా పచ్చదనమే



ఐటీవరం ప్రాంతంలో వేసిన వరి

పుల్లలచెరువు: మండలంలోని ఐటీవరం, మానేపల్లి గ్రామాల్లో రైతులు వరి పంటను విస్తృతంగా సాగు చేస్తున్నారు. కాలువ నీరు పారుదల ఉండటంతో ఆ ప్రాంతంలో ఎక్కువ భాగం వరి పంటను సాగు చేశారు. ఎటు చూసినా భూమి మొత్తం పచ్చదనం పరచుకుని ఉంది. ఆకాశాన్ని అనుకొని ఉందా అన్నట్లుగా కనిపిస్తోంది.

ఉపాధ్యాయుల సమస్యలు వెంటనే పరిష్కరించాలి

దర్శి: ఉపాధ్యాయుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు వాకా జనార్దన్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఉపాధ్యాయుల సమస్యలపై రాష్ట్ర వ్యాప్తంగా ఏపీటీఎఫ్ యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహించ తలపెట్టిన నిరసన కార్యక్రమంలో భాగంగా మండల ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో డిప్యూటీ తహసీల్దార్ వి.వెంకటేశ్వర్లుకు మెమోరాండం సమర్పించారు. ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ దర్శి మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, తూము శ్రీనివాసరావు, నక్కా కోటేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా అధ్యక్షుడు వాకా జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయ సమస్యలు వెంటనే పరిష్కరించాలని, సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి ఓపీఎస్ విధానాన్ని ప్రవేశ పెట్టాలని డిమాండ్ చేశారు. జీఓ 57ను తక్షణ అమలు చేయాలని, పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలను మంజూరు చేయాలని, 12 పీఆర్సీ కమిషన్‌ను నియమించాలని, అన్ని రకాల యాప్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ నాయకులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

లక్కవరంలో వైద్య శిబిరం



జ్వరపీడితులకు చికిత్స అందిస్తున్న వైద్యసిబ్బంది

సాక్షి ఎఫెక్ట్..



సాక్షి

మంచంపట్టిన తాళ్లూరు

ఈ నెల 11న సాక్షి పత్రికలో ప్రచురించిన కథనం

తాళ్లూరు: మండలంలో విజృంభిస్తున్న విషజ్వరాలతో ప్రజలు పడుతున్న తీవ్ర ఇబ్బందుల గురించి, వైద్యాధికారుల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న తీరును వివరిస్తూ 'మంచం పట్టిన తాళ్లూరు' శీర్షికతో ఈ నెల 11వ తేదీన సాక్షి దినపత్రికలో ప్రచురించిన కథనానికి అధికారులు స్పందించారు. తూర్పు గంగవరం ప్రైమరీ హెల్త్ సెంటర్ డాక్టర్ శ్రీకాంత్ ఆధ్వర్యంలో శుక్రవారం మండలంలోని లక్కవరంతో పాటు పలు గ్రామాల్లో వైద్య సిబ్బంది వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. మలేరియా, టైఫాయిడ్, డెంగీ జ్వరాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీకాంత్ మాట్లాడుతూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకుంటూ ఆరోగ్యంగా ఉండాలన్నారు. ఆరోగ్యం విషయంలో సమస్య ఏమైనా ఉంటే వెంటనే ప్రభుత్వ వైద్యశాలకు వచ్చి చికిత్స పొందాలని సూచించారు. హెచ్ఓ కె. చంద్రశేఖరరావు, ఎంఎల్‌హెచ్ పి.వంశీ నాయక్ పాల్గొన్నారు.